భావనను ఎదుర్కొన్నప్పుడు, కచ్చితంగా దయ్యం అనే అనుకుంటారు'' అంటాడు వైజ్‌మన్.

**మన ఆలోచనలే దయ్యాలు...**

దయ్యాలు ఉన్నాయని బలంగా నమ్మేవారు, వాటిని చూసే అవకాశం ఎక్కువగా ఉంటుందని మనస్తత్వ శాస్త్రవేత్తల అభిప్రాయం. దానితోపాటు మరికొన్ని లక్షణాలు కూడా వారిలో ఉంటాయని అంటారు యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మాంచెస్టర్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీకి చెందిన సైకాలజిస్టు నీల్ డేగ్నల్. ఇలాంటివారికి ఆయన 'దయ్యాలతో అనుభవం ఉన్నవారు' అని పేరుకూడా పెట్టాడు. ''వాళ్లు ఏ విషయంలోనూ అస్పష్టతను, సందిగ్ధతను భరించలేరు. అసాధారణ సంఘటనలను, భావనలను విడిచిపెట్టరు. వాటికి పరిష్కారం కనుగొనాలనే ప్రయత్నిస్తారు. మిగతావారితో పోలిస్తే ఊహల్లోనూ, సృజనాత్మకతలోనూ వాళ్లు మేటిగా ఉంటారు. మామూలు సంఘటనలు భయానకంగా మారడానికి అవి కారణమవుతాయి'' అని ఆయన చెప్పాడు.

దయ్యాలు కనబడటానికి ఒంటరితనం కూడా కొంత కారణమవుతుంది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో లాక్‌డౌన్ సమయంలో ఈ రకమైన ఫిర్యాదులు వచ్చాయి. అలాగే న్యూయార్క్‌లోనూ అలాంటి వాతావరణమే కనిపించింది. అలా ఎందుకని 'న్యూయార్క్ టైమ్స్' సైకాలజిస్టులను వివరణ కోరింది. దీనికి విపత్తు వల్ల ఏర్పడిన ఒత్తిడి, ఒంటరితనమే కారణమని అమెరికాకు చెందిన ప్రముఖ మనస్తత్వ నిపుణుడు ప్రొఫెసర్ కుర్ట్ గేరీ చెప్పుకొచ్చారు. ''మీరు నాలుగు గోడల మధ్య బందీగా ఉన్నప్పుడు, మనుషుల సహచర్యం కోరుకుంటున్నప్పుడు ఓ అతీంద్రియ శక్తి మీ వెంట ఉందనే ఆలోచన మీకు సాంత్వనను ఇస్తుంది. అది దైవమా, దయ్యమా అనేది మన ఆలోచనలకు అనుగుణంగా ఉంటుంది'' అని కుర్ట్ గేరీ అభిప్రాయం.

**హాలీవుడ్‌లో దయ్యాల హవా**

దయ్యాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలకు ఉన్నంత గిరాకీ మిగిలిన జానర్లకు కనిపించదు. అందుకే దర్శక నిర్మాతలు హారర్ సినిమాలు తీసి ప్రేక్షకులను భయపెట్టటానికి ఆసక్తి చూపుతారు. హాలీవుడ్‌లో ఈ సంప్రదాయం ఎక్కువగా కనిపిస్తుంది. ప్రతి ఏడాదీ ఈ తరహా సినిమాలు విడుదలవుతూ ప్రేక్షకులకు థ్రిల్ చేస్తూనే ఉన్నాయి. 1995 నుంచి అమెరికా, కెనడాలలో వాటి మార్కెట్ రెట్టింపు అవుతూ వస్తున్నది. అది క్రమంగా పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. దీంతో మరింత ఉత్కంఠ రేపే స్క్రిప్టుల కోసం దర్శకులు పరుగులు పెడుతున్నారు. ఒక్క ఏడాదిలో ఈ తరహా చిత్రాలు 46 రూపుదిద్దుకున్నాయంటే దయ్యాల సినిమాలకు ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతుంది. దాదాపు 798 మిలియన్ డాలర్ల వసూళ్లను రాబట్టాయి. భారీ సెట్టింగులు, విదేశీ లొకేషన్లతో పని లేకపోవటం, తక్కువ బడ్జెట్‌తో సినిమా పూర్తికావటం వంటి అనుకూలతల వల్ల తెలుగులోనే కాదు ఇతర దక్షిణాది భాషల్లో కూడా ఈ తరహా చిత్రాలు ఎక్కువగానే వస్తున్నాయి.

హాలీవుడ్‌లో మొట్టమొదటి హర్రర్ చిత్రం 'ద హాంటెడ్ కాజిల్– (ద హౌస్ ఆఫ్ ద డెవిల్)' 1896లో విడుదలైంది. జార్జి మెల్లిస్ దీన్ని రూపొందించాడు. అప్పటివరకూ ఉన్న పుస్తకాలు, నాటకాలు, చరిత్ర ఆధారంగా పాత్రలకు రూపకల్పన చేశాడు. 1957లో వచ్చిన 'ద కర్స్ ఆఫ్ ఫ్రాంకెన్‌స్టీన్' చిత్రం రంగుల్లో రూపుదిద్దుకున్న తొలి హారర్ చిత్రం. దీనికి ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభించింది. హాలీవుడ్‌లో హారర్ చిత్రాలపై నిర్వహించిన సర్వేలో 'ఎగ్జార్సిస్ట్' (1973) చిత్రం మొదటి స్థానం దక్కించుకుంది. ఒక చిన్నారికి దయ్యం పట్టటం, దానిని తరిమికొట్టడం ఇతివృత్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు మాస్ హిస్టీరియాకు లోనయ్యారు. వాంతులు చేసుకోవటం, స్పృహతప్పి పడిపోవటం వంటివి సంభవించాయి. చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్ల బయట అంబులెన్సులను సిద్ధంగా ఉంచాల్సి వచ్చింది. ఆస్కార్ బెస్ట్ పిక్చర్‌గా నామినేట్ అయిన తొలి దయ్యాల చిత్రం కూడా ఇదే. భారత్‌లోనూ విడుదలైంది. ఆ తర్వాత అది కలిగించిన దుష్పరిణామాల కారణంగా 'ఎగ్జార్సిస్ట్' ప్రదర్శనను నిషేధించారు. హెరిడిటరీ (2018), ద కంజూరింగ్ (2013), ద షైనింగ్ (1980), ద టెక్సాస్ చైన్సా మసాకర్ (1974), ద రింగ్ (2002), హాలోవీన్ (1978), సిన్‌స్టర్ (2012), ఇన్సైడియస్ (2010), ఐటీ (2017) చిత్రాలు ఉత్తమ హారర్ సినిమాలుగా వరుస స్థానాలను ఆక్రమిస్తున్నాయి.

**బాలీవుడ్... టాలీవుడ్**

దర్శకుడు కమల్ అమ్రోహీ రూపొందించిన 'మహల్' చిత్రం భారతీయ చలన చిత్రరంగంలో తొలి హారర్ చిత్రంగా రికార్డు సాధించింది. అశోక్ కుమార్, మధుబాల ఇందులో కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం బాక్సాఫీసు దగ్గర సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంతోనే మధుబాల, లతా మంగేష్కర్‌లు స్టార్‌డమ్ సొంతం చేసుకున్నారు. రామ్‌సే బ్రదర్స్..

ఎఫ్.యు.రామ్‌సే కుమారులు, మనవళ్లు భారతదేశంలో హర్రర్ చిత్రాలకు చిరునామాగా నిలిచారు. 1980లలో వీసీఆర్‌లు ప్రవేశించి పైరసీలు రాజ్యమేలుతున్న రోజుల్లో ఈ చిత్రాలతో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. దాదాపు 30 చిత్రాలు రూపొందించారు. వారి చిత్రాలన్నిటిలో దయ్యం పాత్ర పోషించిన నటుడు అజయ్ అగర్వాల్ తన పాపులారిటీని బాగా పెంచుకున్నాడు. హిందీ నటి బిపాసా బసు ఈ జానర్‌లో ఎక్కువ చిత్రాల్లో నటించి స్క్రీన్ క్వీన్‌గా నిలిచింది. మహేశ్ భట్, ముకేశ్ భట్ నిర్మాణ సారథ్యంలో 'రాజ్' పేరుతో వచ్చిన వరుస చిత్రాలకు విక్రమ్ భట్ దర్శకుడిగా ఉన్నారు. హారర్ చిత్రాలపైన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ఉన్న మక్కువ తెలియనిది కాదు. ఆయన భూత్ (2003), డర్నా మానా హై (2003), డర్నా జరూరీ హై (2006), డార్లింగ్ (2007), ఫూంక్ (2008), అగ్యాత్ (2009) తదితర చిత్రాలను రూపొందించాడు. ఇందులో భూత్, డర్నా మానా హై మాత్రమే ప్రేక్షకులను మెప్పించాయి. బ్లాక్ అండ్ వైట్ రోజుల నుంచీ ఆత్మలు, దయ్యాల చుట్టూ పరిభ్రమించిన తెలుగు సినిమాలు ఎన్నో! దయ్యం అని భ్రమ కల్పించేలా స్క్రీన్‌ప్లే రన్ చేస్తూ నిర్మించిన ఎన్నో సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. 'ఆమె ఎవరు?', 'అర్ధరాత్రి', 'అవేకళ్లు' తదితర సినిమాలు.. క్రైమ్ థ్రిల్లర్ చిత్రాలే అయినా, హారర్ జానర్ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నాయి. ఇటీవల కాలంలో తెలుగులో దయ్యాల సబ్జెక్టులు ఏటా అరడజను వరకు విడుదల అవుతున్నాయి. మనవాళ్లు ఎంతగా దయ్యాల చుట్టూ తిరుగుతున్నారంటే... చివరికి మనుషులను చూసి భయపడే దయ్యాల కథ కూడా సినిమా సబ్జెక్ట్‌గా ఎంచుకుంటున్నారు. ఆత్మలతో కామెడీ చేయిస్తున్నారు. హారర్ జానర్‌ను కామెడీతో మిక్స్ చేయడం వల్ల అటు హాస్యం పండక, ఇటు హారర్ జనరేట్ కాక.. చాలా సినిమాలు ఉస్సూరుమనిపిస్తున్నాయి.

## టాప్ హారర్ బుక్స్ ఇవీ

1. ద షైనింగ్ (స్టీఫెన్ కింగ్)
2. ఫ్రాంకెన్‌స్టీన్ (మేరీ షెల్లీ)
3. ఇట్ (స్టీఫెన్ కింగ్)
4. ద స్ట్రేంగ్లర్ (విలియం లాండే)
5. ఘోస్ట్ స్టోరీ (పీటర్ స్ట్రాబ్)
6. డ్రాకులా (బ్రామ్ స్టోకర్)
7. ద టెర్రర్ (డ్యాన్ సిమన్స్)
8. క్యారియన్ కంఫర్ట్ (డ్యాన్ సిమన్స్)
9. ద హౌస్ ఎక్రాస్ ద లేక్ బై రిలే సాగర్ (టాడ్ రిట్టర్)
10. సమ్‌థింగ్ విక్‌డ్ దిస్ వే కమ్స్ (రే బ్రాడ్బరీ)

